సాక్షి
అనంతపురం
సోమవారం । 16 । అక్టోబర్ । 2023



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



రంగస్థల కీర్తి.. ఆధ్యాత్మిక స్ఫూర్తి

ఆయన రంగస్థలంపైకి వచ్చాడంటే ప్రేక్షకులు మైమరచి పోతారు. మనిషి తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు మణూరు నాగరాజు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.8°/22.6°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలి గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీశా..శరణు



మత్స్యావతారంలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి ఖాద్రీశుని ఆలయంలో స్వామివారు మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఏడు ప్రాంతాల్లో 'ఆరోగ్య సురక్ష'

అనంతపురం మెడికల్: జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. రెడ్డిపల్లి, పులకుర్తి, గార్లదిన్నె, గెనిగెర, సి.వెంగన్నపల్లి, భోగసముద్రం, ఉరవకొండ ప్రాంతాల్లో వైద్య శిబిరాలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎలుగుబంటి మృతి



మృతి చెందిన ఎలుగు బంటి

కళ్యాణదుర్గం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఎలుగుబంటి మృతి చెందింది. ఎర్రంపల్లి గేట్ సమీపంలోని కొండ ప్రాంతం నుంచి ఎలుగు బంట్లు నీళ్ల కోసం రోడ్డు పక్కన పొలాల్లోకి వస్తుంటాయి. అందులో భాగంగానే ఆదివారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న ఓ ఎలుగు బంటిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎలుగుబంటి అక్కడికక్కడే మృతి చెందిందని అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఎలుగు బంటికి కైరేవు నర్సరీలో డీఎఫ్ఓ సందీప్ కృపాకర్, ఎఫ్ఆర్ఓ రామ్‌సింగ్, ఎఫ్ఎస్ఓ షానవాజ్, ఏడీఏ నాగలింగేశ్వరరెడ్డి సమక్షంలో వెటర్నరీ డాక్టర్ నాగరాజు పోస్టుమార్టం నిర్వహించారు.

పీఏబీఆర్‌లో నిలకడగా నీటి మట్టం



కూడేరు: జలాశయంలో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) లో ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో ఇంచుమించు సమానంగా ఉండడంతో నీటి మట్టం నిలకడగా ఉంది. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా రోజూ 170 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌కు చేరుతోంది. పీఏబీఆర్ వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి, అనంతపురం, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు నీటి సరఫరా, నీటి ఆవిరి, లీకేజీ రూపంలో కలిపి రోజుకు సుమారు 150 క్యూసెక్కులు అవుట్ ఫ్లో వెళ్తోంది. ఆదివారం నాటికి డ్యాంలో నీటి మట్టం 2.37 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు.

నేడు చేనేత కార్మికులతో సమావేశం

పుట్టపర్తి అర్బన్/ధర్మవరం: ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు 'ఒన్ డిస్ట్రిక్ ఒన్ ప్రొడక్ట్' పథకంపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్ లూమ్స్, టెక్స్‌టైల్ ఏడీ రమేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఇన్వెస్ట్ ఇండియా సంస్థ ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ చేనేత కార్మికులతో సమావేశమవుతారన్నారు. చేనేత పట్టు చీరల ఉత్పత్తి కేంద్రాలు, డైయింగ్ యూనిట్లను పరిశీలిస్తారన్నారు. మధ్యాహ్నం సోమందేపల్లి వీవర్స్ కాలనీని సందర్శిస్తారని తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ధర్మవరాన్ని పట్టు చీరల ఉత్పత్తికి సంబంధించి 'ఒన్ డిస్ట్రిక్ ఒన్ ప్రొడక్ట్'కు ఎంపిక చేసినట్లు వివరించారు. ఇందులో భాగంగా అవార్డు అందజేస్తారని, ఈ విషయంపై చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఫోర్టిఫైడ్‌తో సంపూర్ణ పోషణ

- ప్రజారోగ్యానికి జగన్ సర్కారు అధిక ప్రాధాన్యత
- ఫోర్టిఫైడ్ బియ్యంలో పుష్కలంగా ఫోలిక్ యాసిడ్, ఐరన్
- ఈ ఆహారం తీసుకోవడంతో శరీరానికి మెండుగా సూక్ష్మపోషకాలు
- జిల్లాలో కార్డుదారులకు ప్రతి నెలా 9,920 టన్నుల బియ్యం పంపిణీ

ప్రజారోగ్యానికి జగన్ సర్కారు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కార్డుదారులకు పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తోంది. బియ్యానికి అదనంగా విటమిన్లు, ఖనిజాలను జోడించడాన్ని రైస్ ఫోర్టిఫికేషన్ అంటారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి కీలక సూక్ష్మపోషకాలను అదనంగా బియ్యంలో చేర్చడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అరికట్టే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది.

అనంతపురం అర్బన్: జిల్లాలో 6,63,934 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు ప్రతి నెలా 9,920 టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఫోర్టిఫైడ్ బియ్యం భుజించడం ద్వారా శరీరానికి సూక్ష్మపోషకాలు అందుతాయి. ప్రధానంగా పౌష్టికాహార లోపం ఉన్న మహిళలు, చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యం ఎంతో ఉపయోగంగా ఉంటాయి. ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బి12తో చేసిన పిండితో ఫోర్టిఫైడ్ బియ్యం కెర్నెల్స్ తయారు చేస్తారు. వీటిని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యంలో కలుపుతారు. ఐసీడీఎస్, ప్రజాపంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రభుత్వ పథకాల్లో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తోంది.

ఆరోగ్యానికి ఎంతో మేలు

ఫోర్టిఫైడ్ బియ్యం ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుంది. ముఖ్యంగా ఇందులోని ఫోలిక్ యాసిడ్ గర్భిణులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పిల్లల్లో మెదడు, వెన్నెముక పెరుగుదలకు తోడ్పడుతుంది. ఇక విటమిన్ బి12 మెదడు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి, ఎర్ర రక్తకణాల ఉత్పత్తిలో కీలకంగా పనిచేస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని సరైన మోతాదులో ఉంచుతూ రక్తహీనతను అరికట్టడంలో ఐరన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది.



ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ చేసిన బియ్యం

ఫోర్టిఫైడ్ బియ్యం

400 మైక్రో గ్రామ్స్ అవసరం

మనం రోజూ తీసుకునే ఆహారంలో 400 మైక్రో గ్రామ్స్ ఫోలిక్ యాసిడ్ ఉండేలా చూసుకోవాలి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా మనం తీసుకునే 100 గ్రాముల అన్నంలో ఫోలిక్ యాసిడ్ 17 మైక్రోగ్రామ్స్ నుంచి 125 మైక్రోగ్రామ్స్ మధ్య ఉండాలి. అదే విధంగా ఐరన్ 28 నుంచి 42 మిల్లీగ్రాములు ఉండాలి. ఇక ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం 100 గ్రాముల్లో 98 మైక్రోగ్రామ్స్ ఫోలిక్ యాసిడ్, ఐరన్ 40 మిల్లీగ్రాములు ఉంటుంది. ఇక విటమిన్ బి12 సమృద్ధిగా లభిస్తుంది.

ప్రయోజనాలు వివరిస్తున్నాం

ఫోర్టిఫైడ్ బియ్యంలో ఉండే పోషక విలువల గురించి ప్రజలకు వివరిస్తున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయనే విషయాన్ని బియ్యం పంపిణీ చేసే సమయంలో కార్డుదారులకు తెలియజేయాలని వలంటీర్లకు, ఎండీయూ వాహన నిర్వాహకులకు చెబుతున్నాం.

– శోభారాణి, జిల్లా సరఫరాల అధికారి

సూక్ష్మపోషకాలు పుష్కలం

ఫోర్టిఫైడ్ బియ్యంలో సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బీ12 కలిగిన ఈ బియ్యంతో చేసిన పదార్థాలు బలవర్ధకమైన ఆహారం. దీన్ని తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారిస్తుంది. ఫోర్టిఫైడ్ బియ్యం ప్రయోజనాలపై ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– గౌతమి, కలెక్టర్

అవగాహన కల్పిస్తున్నాం

ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంత ఉపయోగకరమో ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఉండే సూక్ష్మపోషకాలు, ఆ బియ్యంతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని మహిళలకు వివరంగా తెలియజేస్తున్నారు.

– శ్రీదేవి, పీడీ, మహిళా శిశుసంక్షేమ శాఖ

బెట్టింగ్ జోలికెళ్లొద్దు

అనంతపురం క్రైం: బెట్టింగ్ జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రికెట్‌ను వినోదం కోసం చూడాలని సూచించారు. చాలామంది స్వార్థపరులు ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని రూ.కోట్లు గడిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారి వలలో పడి బాల్ టు బాల్ బెట్టింగ్, అభిమాన క్రికెటర్ స్కోర్‌లాంటి వాటిపై అత్యాశకు పోయి బెట్టింగ్ వేసి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యాప్‌లతో పాటు బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తున్న, ఆడిస్తున్న వారిని కూడా వదిలే ప్రసక్తే లేదన్నారు. క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే తక్షణం 94407 96800 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

కొంప ముంచిన అత్యాశ

కళ్యాణదుర్గం: అత్యాశకు పోయి ఓ వ్యక్తి నిలువునా మోసపోయాడు. తక్కువ ధరకు బంగారం అంటే నగదు చెల్లించి తీసుకున్నాడు. తీరా అది నకిలీ అని తెలిశాక లబోదిబోమన్నాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అద్దంకి ప్రాంతానికి చెందిన రాముకు ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తనకు కళ్యాణదుర్గం ప్రాంతంలో బంగారం నిధి దొరికిందని.. దీన్ని రూ.5లక్షలకు అమ్మాలనుకుంటున్నానని తెలపడంతో రాముకు ఆశ కలిగింది. అయితే తాను రూ.3లక్షలు మాత్రమే ఇస్తానని అనడంతో సరే రండి అని చెప్పాడు. ఈ మేరకు రాము తన స్నేహితుడితో కలిసి నగదుతో ఆదివారం కళ్యాణదుర్గం మండలం పాతచెరువు సమీపంలోకి చేరుకున్నాడు. అక్కడకు వచ్చిన అపరిచిత వ్యక్తి తొందరగా డబ్బు తీసుకుని, వారికి ఒక పార్సిల్ ఇచ్చాడు. ఎక్కువ సమయం ఇక్కడే ఉంటే పోలీసులు వచ్చే అవకాశముందంటూ హడావుడిగా నగదుతో ద్విచక్రవాహనంలో ఉడాయించాడు. పార్సిల్ కవర్ తీసుకున్న రాము కళ్యాణదుర్గంలోని ఓ జ్యువెలరీషాపు వద్దకెళ్లి తనిఖీ చేయించాడు. అయితే అది బంగారం కాదని చెప్పడంతో తాము మోసపోయామని రాముకు అర్థమైంది. వెంటనే రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నాం



అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- వాట్సాప్ కాల్స్ ద్వారా బెదిరింపులు
- డబ్బు కోసం ప్రైవేట్ వ్యక్తుల డిమాండ్
- సామాజిక, కుల సంఘాల పేరుతో ఇబ్బంది
- అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలకు సబ్‌రిజిస్ట్రార్ల లేఖ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'కొంతమంది సామాజిక సంఘాలు, కుల సంఘాలు, స్థానిక మీడియా సంస్థల పేరుతో మమ్మల్ని రోజూ వేధిస్తున్నారు. డబ్బు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఇప్పటికే మా ఉద్యోగి ఒకరు ఒత్తిళ్లు తట్టుకోలేక మృతి చెందారు. దీనిపై కఠినమైన చర్యలు తీసుకుంటే తప్ప మేము విధులు నిర్వర్తించలేం' అంటూ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన సబ్ రిజిస్ట్రార్లు ఇరు జిల్లాల ఎస్పీలకు లేఖలు అందజేశారు. జిల్లా రిజిస్ట్రార్ సైతం లేఖలో సంతకం చేశారు. ఈ లేఖ జిల్లా వ్యాప్యంగా చర్చనీయాంశంగా మారింది. సబ్‌రిజిస్ట్రార్లు మొత్తం లేఖలో సంతకాలు చేశారు. ఇలా డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు మొత్తం ఎస్పీకి లేఖ ఇవ్వడం ఇదే మొదటి సారి అనే చర్చ జరుగుతోంది.

లేఖలో ఏముందంటే...

'కొద్ది నెలల నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు కులసంఘాలు, సామాజిక కార్యకర్తలు, స్థానిక మీడియా ప్రతినిధుల పేరుతో వచ్చి మా విధులకు ఆటంకం కలిగిస్తున్నారు. డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వకపోతే ఆర్టీఐ యాక్ట్‌ద్వారా అప్లికేషన్లు పెడుతున్నారు. అయినా స్పందించకపోతే వాట్సాప్ గ్రూపుల్లో మా నంబర్లు యాడ్ చేసి దారుణమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తామంటారు. విజయవాడ ఉన్నతాధికారులకు నిరాధార ఆరోపణలతో కూడిన మెసేజీలు పెడుతున్నారు. బెదిరిస్తున్న వారి నంబర్లు బ్లాక్ చేస్తే వేరే నంబర్ల నుంచి వాట్సాప్‌కాల్ చేసి తీవ్ర పదజాలంతో దూషిస్తున్నారు' అంటూ లేఖలో రాశారు.

లేఖలో కొంతమంది పేర్లు కూడా..

సబ్‌రిజిస్ట్రార్‌లు రాసిన లేఖలో కొంతమంది పేర్లు పొందుపరిచారు. లేఖలో పేర్కొన్న వారు తరచూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి ఇబ్బంది పెట్టడం, విధులకు ఆటంకం కలిగించడం, వాట్సాప్ గ్రూపుల్లో దారుణంగా వ్యాఖ్యలు చేసినట్టు వెల్లడించారు. ఇటీవల జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం మృతి చెందారని, ఇలాంటి వారి ఒత్తిళ్లే అందుకు కారణమని ఆరోపించారు. ఇలా చాలామంది కార్యాలయాలకు వచ్చి భయాందోళనకు గురిచేస్తూ తమను పనులు చేయనివ్వడం లేదని పేర్కొన్నారు.

కేసు నమోదు చేస్తాం

ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం, వారిని ఇబ్బంది పెట్టడం వంటి వాటిపై సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేస్తాం. వారిపై 353 సెక్షన్ కింద కేసు కడతాం. ఎవరైనా సరే పరిధికి మించి వ్యవహరిస్తే వారి చర్యలు తీసుకుంటాం. సబ్‌రిజిస్ట్రార్‌లు మాకు లేఖ ఇవ్వడం వాస్తవమే. దీనిపై త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– అన్బురాజన్, ఎస్పీ, అనంతపురం

తొలివిడత తనిఖీకి పటిష్ట ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ అన్బురాజన్, డీఆర్ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: ఈవీఎంలు, వీవీప్యాట్‌ల తొలి విడత తనిఖీ (ఎఫ్ఎల్‌సీ) నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని గోడౌన్‌లో సోమవారం నుంచి నవంబరు 10 వరకు ఈవీఎంలు, వీవీప్యాట్‌ల ఎఫ్ఎల్‌సీ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో కలిసి కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు తొలి విడత తనిఖీ నిర్వహించాలని ఆదేశించారు. గోడౌన్ వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ గాయత్రీదేవి, ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, నగరపాలక సంస్థ ఏసీ రమణారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ : ఈవీఎంల తొలి విడత తనిఖీ (ఎఫ్ఎల్‌సీ) నిర్వహణపై సిబ్బందికి ఆదివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో శిక్షణ ఇచ్చారు. ఎఫ్ఎల్‌సీ ఏ విధంగా చేయాలనేదానిపై డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర వివరించారు. ఎఫ్ఎల్‌సీ నిర్వహించే సిబ్బంది తమ వెంట సెల్‌ఫోన్లు, కెమెరాలు, స్పై కెమెరాలు వంటివి తీసుకురాకూడదని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మహిళల స్వయం ఉపాధికి ఊతం



ఈ మహిళ పేరు షేక్ షరీఫా బీ. బెళుగుప్ప మండల కేంద్రంలో మహాలక్ష్మి గ్రామ సంఘంలో ఉన్నారు. పప్పుల బట్టీ ఏర్పాటు చేశారు. సీడ్ క్యాపిటల్ మొత్తం నుంచి రూ.40 వేలు, స్వంతంగా రూ.లక్ష వేసుకుని పప్పుల తయారీ మిషన్ కొనుగోలు చేశారు. దీంతో రోజువారీ ఉత్పత్తికి అదనంగా 50 కేజీలు ప్రాసెసింగ్ చేస్తున్నారు. దీంతో వార్షికాదాయం రూ.1.50 లక్షలు వస్తోంది. స్థానిక ప్రాంతాల్లోనే అమ్మకాలు చేస్తుండడంతో ఖర్చులు తగ్గి.. ఆదాయం పెరిగిందని షరీఫాబీ చెబుతున్నారు.

- ఎస్‌హెచ్‌జీ సభ్యుల జీవనోపాధుల పెంపుదలకు చర్యలు
- ఆహార ఉత్పత్తులు, ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.40వేల రుణం
- జిల్లాలో 724 మందికి రుణం అందించే దిశగా కసరత్తు

అనంతపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) సభ్యులైన మహిళలకు సాంకేతిక పరిజ్ఞానంతో ఆహార ఉత్పత్తుల తయారీకి జీవనోపాధి రుణాలు చేయూతనందిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు మరింత విస్తరించాలని పేదల జీవనోపాధులు పెంచుకోవడానికి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు రుణాలు త్వరితగతిన అందే విధంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో సీడ్ క్యాపిటల్ విధానం అమల్లోకి తెచ్చారు. ఒక్కొక్కరికి రూ.40 వేల చొప్పున ఆరు శాతం వడ్డీతో రెండు సంవత్సరాల కాల వ్యవధితో కూడిన రుణాలను అందించడానికి డీఆర్‌డీఏ చేయూతనిస్తోంది. స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా చర్యలు తీసుకుంటోంది.




పప్పుల బట్టీలో షేక్ షరీఫాబీ

సింహభాగం ఆహార పదార్థాల ఉత్పత్తులే..

పేదరిక నిర్మూలన వ్యూహంలో భాగంగా సంఘంలోని 18 నుంచి 60 సంవత్సరాల్లోపు వయసు కలిగిన మహిళలు సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆదాయాభివృద్ధి కోసం మార్గాలు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. జీవనోపాధులు 70 శాతం ఆహార పదార్థాల ఉత్పత్తులకు చెందినవే ఉన్నాయి. ఆహార ఉత్పత్తులు, ప్రాసెసింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న వారికి కావాల్సిన ఆర్థిక, సాంకేతిక సహాయాలు అందించడం ద్వారా స్వదేశీ ఉత్పత్తుల అభివృద్ధి పెంపొందుతుంది. ఈ నేపథ్యంలో ఆత్మనిర్భర భారత్ అభియాన్ ప్రాజెక్ట్- ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో క్రెడిట్ ఫుడ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం రూపకల్పన చేశారు. మహిళలు చేపట్టిన ఆహార పదార్థాల తయారీ కార్యక్రమాలకు ఆర్థికసాయం, సభ్యులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయడం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అమలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ కోఆపరేటివ్ సొసైటీ నోడల్ సంస్థగా వ్యవహరిస్తోంది. ఆహార ఉత్పత్తులు తయారు చేసే సభ్యులను పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) గుర్తించి సిఫార్సు చేస్తే నోడల్ సంస్థ నిధులు విడుదల చేస్తుంది.

రూ.2.62 కోట్ల లబ్ధి



జిల్లాలో మొత్తం రూ.2.62 కోట్ల ఆహార ఉత్పత్తులు ప్రాసెసింగ్ చేసే మహిళలకు రుణంగా ఇవ్వనున్నాం. జిల్లాలో 724 మందికి రుణాలందించాలని కసరత్తు చేపట్టాం. ఇప్పటికే 676 మందిని గుర్తించాం. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే సంఘాల లీడర్లను కలిస్తే రుణం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటాం.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

టీడీపీ నాయకుడి ఇంట పేకాట

- ప్రధాన నిందితుడు పరిటాల సునీత అనుచరుడు
- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాప్తాడురూరల్: మాజీ మంత్రి పరిటాల సునీత అనుచరుడు, టీడీపీ నాయకుడు పేకాట నిర్వహిస్తూ పోలీసులకు అడ్డంగా దొరికాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ జాకీర్ కొట్టాలుకు చెందిన కె.రామాంజనేయులు తెలుగు దేశం పార్టీ నాయకుడు. ఇతడి భార్య గతంలో టీడీపీ తరఫున ఎంపీటీసీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయింది. రామాంజనేయులు ముందునుంచి పేకాట నిర్వహిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాడు. గత ప్రభుత్వంలో పరిటాల సునీత పేరు చెప్పుకుని విచ్చలవిడిగా పేకాట ఆడించాడు. ఇదే క్రమంలో ఆదివారం తన నివాసంలో పేకాట ఆడిస్తున్నాడు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ మునీర్ అహమ్మద్, సిబ్బంది వెళ్లి దాడి చేశారు. పోలీసుల దాడిలో కె.రామాంజనేయులుతో పాటు ఆదేకాలనీకి చెందిన దూదేకుల మహబూబ్‌బాషా, బలిజ శ్రీనివాసులు, కురుబ అజయ్, మాల శంకర్ దొరికారు. వీరి నుంచి రూ.6,820 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

దేవీ నమోస్తుతే..



అనంతపురం మున్సిపల్ కాంప్లెక్స్‌లో కాళికామాత రూపంలో అమ్మవారు

దసరా పండుగ సందర్భంగా దేవీ శరన్నవరాత్రులు జిల్లాలో ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేక రూపాల్లో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పండితులు నవరాత్రుల విశిష్టతను వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

– అనంతపురం కల్చరల్

క్లుప్తంగా

18వ శతాబ్దం నాటి తామ్ర శాసనం లభ్యం



లభించిన తామ్ర శాసనం

పావగడ: పాలేగాళ్ల కాలానికి చెందిన అప్రకటిత తామ్ర శాసనం లభ్యమైంది. పావగడ తాలూకా వైఎన్ హొసకోట హోబళికి చెందిన దళవాయి హళ్లి గ్రామంలోని ఉపాధ్యాయుడు అశోక్ ఇంట్లో ఈ తామ్ర శాసనాన్ని గుర్తించినట్లు స్థానిక చరిత్ర పరిశోధకుడు హోమా నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 18వ శతాబ్దానికి చెందిన ఈ తామ్ర శాసనాన్ని కన్నడ భాషతో కూడిన తెలుగు లిపితో రాశారన్నారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలానికి చెందిన అవధాని నరసింహయ్య సహకారంతో శాసనాన్ని పరిశీలించగా.. 33 పంక్తులతో కూడిన ఈ శాసనం శాలివాహన శకం 1699 సంవత్సరంలో యల్లప్ప నాయక వంశానికి చెందిన రామప్ప నాయక రాయించినట్లుగా తెలుస్తోందన్నారు. కన్నయ్య వంశానికి చెందిన శినమాగలు గోత్రం సిద్దరామనాయక కుమారుడు రంగప్ప నాయకునికి విశిష్ట హక్కులు దానంగా ఇచ్చినట్లుగా శాసనంలో పేర్కొన్నట్లుగా ఉందన్నారు.

19న బెస్త కులస్తుల వివాహ పరిచయ వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న బెస్త సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: ఈ నెల 19న స్థానిక సాయిరామంలో బెస్త కులస్తుల ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం సాయి ఆరామంలో నిర్వహించిన బెస్త సేవా సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రకటించారు. తొలిసారిగా ఏర్పాటు చేయనున్న వివాహ పరిచయ వేదికకు రాయలసీమ జిల్లాలోని బెస్త కులస్తులందరినీ ఆహ్వానించినట్లు వివరించారు. పరిచయ వేదికకు వధూవరుల వివరాలు ప్రదర్శించాలనుకునే వారు దరఖాస్తుతో పాటు బయోడేటా, కార్డు సైజు ఫొటోలను అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతిప్రసాద్, వెంకటేష్, నాయకులు దత్తశివ, జైసాయి, నరేష్, రవి, గురుశేఖర్, జ్యోతిబాబు పాల్గొన్నారు.

రంగస్థల కీర్తి.. ఆధ్యాత్మిక స్ఫూర్తి

బాలచంద్రుడిగా, శకునిగా, కర్ణుడిగా ఆయన రంగస్థలంపైకి వచ్చాడంటే ప్రేక్షకులు మైమరచిపోతారు. నటుడిగా, మానవతామూర్తిగా, ఆధ్యాత్మిక సేవా తత్పరునిగా, ప్రతి ఇంటా శ్రీవారి కల్యాణోత్సవాలను ఉచితంగా నిర్వహిస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. మనిషి తలచుకుంటే దేన్నైయినా సులువుగా సాధించవచ్చని చాటుతున్న ఆయనే మణూరు నాగరాజు. తన విలక్షణ జీవన ప్రస్థానంపై ఆయన మాటల్లోనే...

– అనంతపురం కల్చరల్:



నాటికలో నాగరాజు



శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న నాగరాజు కుటుంబ సభ్యులు

- విలక్షణ జీవనం 'మణూరు' సొంతం
- రంగస్థల నటుడిగా రాణింపు
- ఉచితంగా శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తూ ఆదర్శం
- ఆధ్యాత్మిక స్థలాలకు పాదయాత్రలతో యువతకు సందేశం

నేను పుట్టి పెరిగింది అనంతపురంలోనే. బీఎస్ఎన్ఎల్ సంస్థలో నేనూ, భార్య ఉమాదేవి ఇద్దరం పదవీ విరమణ చేశాం. కళాశాలలో చదువుతున్నప్పటి నుంచే నాటకాలంటే పిచ్చి. వందల సార్లు బాల చంద్రుడు, శకుని ఏకపాత్రాభినయం చేశా. అవార్డులు,రివార్డులు అందుకున్నా. మేం వేసిన రాఘవేంద్ర విజయం నాటకం మంత్రాలయ పీఠాధిపతులను మెప్పించింది. నా కుమారులు ఫణికుమార్, యశ్వంత్, భార్య కూడా రంగస్థలంపై మక్కువతో నటరాజు సేవలో తరించినవాళ్లే.

మొరార్జీదేశాయ్‌కు అనువాదకుడిగా..

మా నాన్న మణూరు రామచంద్రరావు స్వాతంత్ర్య సమరయోధుడు. స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లి వచ్చాడు. జనతా పార్టీ రాష్ట్ర సెక్రటరీగా ఉండేవారు. అప్పటి ప్రధాన మంత్రి మురార్జీ దేశాయ్, కేంద్రమంత్రులు మధుదండావతే, బాబూ జగ్జీవన్‌రామ్ వంటి ఉద్దండులకు ఆయన అనువాదకుడిగా ఉన్నాడు. నిత్యం రాజకీయాల్లో మునిగితేలారు. అయితే, ఆయన వారసత్వాన్ని ఎందుకనో వద్దనుకుని ఉద్యోగిగా, నటుడిగానే స్థిరపడిపోయా.

యువతలో స్ఫూర్తినింపేందుకే..

యువత అనుకుంటే ఏమైనా సాధించగలరు. ఆధ్యాత్మిక మార్గంలోనైతే మరింత సాధ్యమవుతుంది. అయితే, నేను చాలా మందిని గమనించా. మనం ఇది చేయగలమా అనే సంశయంలో ఉంటున్నట్లు గుర్తించా. అందుకే వారిలో స్ఫూర్తినింపేందుకు 66 ఏళ్ల వయసులోనూ ఆధ్యాత్మిక పాదయాత్రలు చేస్తున్నా. ఇప్పటివరకూ 7 సార్లు తిరుమలకు అనంత నుంచి నడుచుకుంటూ వెళ్లొచ్చా. 18 సార్లు శబరిమల పెద్ద పాదం, చిన్నపాదం నడిచా. ఇంత వయసులోనూ అరుణాచలంలో దాదాపు 14 కి.మీ ఉండే గిరి ప్రదక్షిణను రోజుకు రెండు సార్లు 21 రోజులు చేశా. దీన్ని బట్టి నేను చెప్పేదిమేమింటే, ఏదీ అసాధ్యం కాదన్నదే.

అందుకే శ్రీవారి కల్యాణోత్సవాలు..

ఎక్కువ వ్యయంతో కూడుకున్నది కాబట్టి చాలా మందికి శ్రీవారి కల్యాణోత్సవం ఇంటి వద్ద జరిపించుకోవడం కలగా ఉంటుంది. వాటిని పూర్తిగా ఉచితంగా అందించాలన్న ఆశయంతో తిరుమల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని విగ్రహాలు తెప్పించి ప్రతి ఇంటిలో కల్యాణోత్సవాలను ఉచితంగా జరిపిస్తున్నా. ఇప్పటికి 480 దాటిపోయాయి. ఎవరి ఇంటికి పిలిపించినా సేవాభావంతో చేయిస్తా. కరోనా రోజుల్లోనూ ఒక్క రోజు కూడా ఇంట్లో ఉండకుండా నిత్యసేవలందించాం. లోక కల్యాణం కోసం సేవలు సాగాలన్న గురువుల మాట కోసం సేవారంగంలో ఉన్నాం.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.10 లక్షల విలువైన 22 వాహనాల స్వాధీనం
- 8 మంది ముఠా సభ్యుల్లో ఐదుగురి పట్టివేత
- ముగ్గురు ప్రధాన నిందితుల కోసం గాలింపు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

మదనపల్లె (అన్నమయ్య జిల్లా): రోడ్డు పక్కన, ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను వారు వెల్లడించారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వన్‌టౌన్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కొందరు వ్యక్తులు చూసి పరారయ్యారు. గమనించిన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించడంతో తాము చేసిన చోరీల గురించి వివరించడంతో వివిధ కంపెనీలకు చెందిన 22 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కర్ణాటకలోని కోలారు జిల్లా మాస్తి తాలూకా మాలూరుకు చెందిన కావడి శ్రీనివాస్, అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె జింకదాట్లపల్లెకు చెందిన జి.వరదరాజులు, మదనపల్లె టౌన్ బసినికొండ నివాసి షేక్ అజీజ్, శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన షేక్ మహమ్మద్ రసూల్, మొలకలచెరువు మండలం పాత మొలకలచెరువుకు చెందిన కావడి శేఖర్ ఉన్నారు. నిమ్మనపల్లె, మదనపల్లె వన్, టూ, ముదివేడు, బి.కొత్తకోట, పీలేరు పోలీస్ స్టేషన్లలో వీరిపై కేసులు ఉన్నట్లుగా వెల్లడైంది. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు తమిళనాడుకు చెందిన అరుణాచలం, రాజేంద్ర, నరసింహులు కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా, అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఎస్.మహబూబ్‌బాషా, ఎస్ఐ సి.హరిహరప్రసాద్, కానిస్టేబుళ్లు చక్రపాణిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్‌బీ.జైనుద్దీన్లను డీఎస్పీ కేశప్ప అభినందించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

- జగనన్నకు మంచి చేయడం తెలుసు
- దోచుకోవడం చంద్రబాబు నైజం
- అవినీతికి పాల్పడినందుకే చంద్రబాబుకు రిమాండ్
- మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ కొనియాడారు. కంబదూరులోని ఓబయ్య కాలనీలో సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె పలువురికి ఇంటి పట్టాలు పంపిణీ చేసి, మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు, ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒకేలానే ఉందన్నారు. అయితే చంద్రబాబు హయాంలో కేవలం టీడీపీ నాయకులకు మాత్రమే లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం అంటే అందరికీ తెలిసేలా సంక్షేమ పాలనను సీఎం వైఎస్ జగన్ సాగిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని అడ్డగోలుగా దాచుకుని దాచుకున్నందుకే చంద్రబాబు రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వమని అందరూ విశ్వసిస్తున్నారన్నారు. ప్రజలకు మరింత మేలు చేసేందుకు మరోసారి జగనన్నకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నయాజ్ అహ్మద్, రాష్ట్ర జానపద, సృజనాత్మక ఆకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, మండల కన్వీనర్ బాలరాజు, వైస్ ఎంపీపీ భీమేష్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్, నాయకులు ఐ.సుధీర్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, మల్లూరి వెంకటేశులు, ఫయాజ్, అబ్బాస్, పవన్, రామస్వామి, విల్సన్, రాజు, కిరణ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం: నగరంలోని రంగస్వామి నగర్‌కు చెందిన లోకేష్ (31) ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్నత చదువులు అభ్యసించినా సరైన ఉద్యోగం రాలేదంటూ మదన పడేవాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఆదివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం మూడో పట్టణ ఎస్ఐ ధరణీకిషోర్ తెలిపారు.

పాసింగ్ అవుట్ పరేడ్ వాయిదా

అనంతపురం క్రైం: ఈ నెల 16న జరగాల్సిన ప్రొబెషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ వాయిదా పడింది. సాంకేతిక కారణాల నేపథ్యంలో పరేడ్‌ను ఈ నె 23కి వాయిదా వేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

తాగిన టీకి డబ్బు కట్టమంటే దాడికి తెగబడ్డారు!

అనంతపురం క్రైం: తాగిన టీకి సంబంధించి డబ్బు చెల్లించాలని కోరిన నిర్వాహకుడిపై అల్లరిమూక దాడికి తెగబడింది. అనంతపురంలోని శారదనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. నగరానికి చెందిన రాఘవేంద్ర... శారద నగర్‌లో టీ కేఫ్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రోజూ రోజూ క్రమం తప్పకుండా కొందరు యువకులు కేఫ్‌లో తిష్టవేసి టీ తాగి డబ్బు తర్వాత ఇస్తామంటూ వెళ్లిపోయేవారు. ఈ క్రమంలో వారు దాదాపు రూ.5 వేలకు పైగా బకాయి పడ్డారు. ఆదివారం కేఫ్ వచ్చిన యువకులు తొలుత టీ తాగారు. అనంతరం వెళ్లబోతుండగా ఇప్పటికే తనకు అప్పులు ఎక్కువగా ఉన్నాయని, బకాయిపడ్డ రూ.5 వేలు ఇస్తే ఎంతో వెసులుబాటుగా ఉంటుందని రాఘవేంద్ర అడిగాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమనే డబ్బు అడుగుతావా? అంటూ ఆ యువకులు ఇనుపరాడ్‌తో రాఘవేంద్రపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. తీవ్ర రక్తగాయాలతో కిందపడి కొట్టుమిట్టాడుతున్న రాఘవేంద్రను వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై క్షతగాత్రుడిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు టీ కేఫ్‌ను పరిశీలించారు. ఘటనపై స్థానికులతో ఆరా తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేడు టీటీ ఫైనల్స్



టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడిన క్రీడాకారులు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా సాగుతున్న ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండ్ స్టేట్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ పోటీలు తుది దశకు చేరుకున్నారు. పోటీల్లో భాగంగా సోమవారం ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఆదివారం జరిగిన పోటీలను ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి పి.విశ్వనాథ్ పరిశీలించారు. ఉమెన్స్ సెమీ ఫైనల్స్‌లో వై. వైష్ణవి సూర్య (తూర్పుగోదావరి)పై కాజోల్ (ఎన్టీఆర్ జిల్లా) గెలుపొందారు. అలాగే గుణ సంయుక్తపై శైలు (ఎన్టీఆర్‌జిల్లా) గెలుపొందారు. అండర్ 17 విభాగంలో పి. హాసినిపై శ్రీశాన్వి (అనంతపురం), మోహిత గాయత్రి మాచిరాజుపై జి. సిరి పావని (తూర్పుగోదావరి) గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వనాథ్ మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి టీటీ పోటీలను ఎలాంటి లోటు రానివ్వకుండా నిర్వహిస్తుండడం సంతోషదాయకమన్నారు. ఇందుకు సహకరించిన ఆర్డీటీకి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో టీటీ అభివృద్ధికి గత 23 ఏళ్లుగా డాక్టర్ అక్బర్ సాహెబ్ చేసిన కృషిని కొనియాడారు. భవిష్యత్తులో జోనల్ మ్యాచ్‌లు కూడా అనంతపురంలో నిర్వహిస్తామని ప్రకటించారు. జిల్లా టీటీ అసోసియేషన్ అధ్యక్షుడు మేజర్ బి. మురళీధర్‌రావు, కార్యదర్శి పి.కేశవ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్, జయరాజ్ పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి

పుట్టపర్తి టౌన్: పాత మిద్దెను కూలుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం జానకంపల్లికి చెందిన మల్లెల వెంకటేష్ (57)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించే వెంకటేష్... ఆదివారం అదే గ్రామానికి చెందిన పెద్దన్న పాత మిద్దెను కూల్చే పనికి వెళ్లాడు. మిద్దెపై పనిలో నిమగ్నమైన ఆయన ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

పరిగి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం కొడిగెనహళ్లిలోని శాసనకోట రోడ్డులో నివాసముంటున్న నాగరాజు (35)కు భార్య రాధిక, ఇద్దరు కుమార్తెలు, తల్లి హనుమక్క ఉన్నారు. పరిగిలోని జెడ్పీహెచ్ఎస్‌లో నైట్ వాచ్‌మెన్‌గా తల్లి పనిచేస్తోంది. మగ్గం పనులతో నాగరాజు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇటీవల రాధిక మూడో కాన్పులో మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో మగ్గం పనులతో ముగ్గురు కుమార్తెలను ఎలా పెంచి పోషించాలోనంటూ మదనపడుతుండేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి బాలింతకు సాయంగా తల్లి ఉంచి, ఆమె విధులకు నాగరాజు హాజరయ్యాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న ఆయన... నేరుగా గదిలోకి వెళ్లి ఇనుప కొక్కికి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ప్రభుత్వాన్ని మెప్పించి సమస్యలు పరిష్కరించుకుందాం

- ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు



మాట్లాడుతున్న దివాకర్‌రావు

అనంతపురం అర్బన్: విధుల నిర్వహణలో ప్రభుత్వాన్ని మెప్పించి... సమస్యలు పరిష్కరించుకుందామని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఆర్ఎన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్ పిలుపునిచ్చారు. అపంతపురంలోని కృష్ణకళామందిర్‌లో ఉన్న రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ మహాజన సభ ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సభకు దివాకర్‌రావు, ఖాన్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాని మెప్పించడం ద్వారా సమస్యల పరిష్కారం చాలా సులువవుతుందన్నారు. ఇందుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సంఘటిత కావాలన్నారు. వివిధ శాఖల్లో తక్కువ వేతనంతో కొన్నేళ్లుగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అభద్రతాభావంతో ఉన్నారన్నారు. వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. చిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీజేఏసీ అమరావతి ఎప్పుడూ ముందుంటుందన్నారు. అల్లం సురేశ్‌బాబు మాట్లాడుతూ... సమాన పనికి సమాన వేతనం ఇచ్చి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలన్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను పునరుద్ధరించాలన్నారు.

నూతన కమిటీల ఎన్నిక..

సభలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించి ఏపీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నూతన జేసీ జిల్లా కమిటీలను ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా కమిటీ చైర్మన్‌గా పి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాఘవేంద్రరావు, కోశాధికారిగా బి.పుల్లయ్యతో పాటు 17 మంది సభ్యులు, శ్రీసత్యసాయి జిల్లా కమిటీ చైర్మన్‌గా ఎస్.గంగాద్రి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రమేష్‌నాయక్, కోశాధికారిగా ఈసీ ప్రశాంత్‌కుమార్‌తో పాటు 17 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

వ్యక్తిపై కత్తితో దాడి

అనంతపురం క్రైం: కుటుంబసభ్యులకు దూరంగా రైల్వే స్టేషన్‌ను ఆవాసంగా చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పల మండలం దుర్గం గ్రామానికి చెందిన మారెప్ప అనంతపురానికి చేరుకుని కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై భార్యాపిల్లలను వదిలి రాత్రి వేళల్లో రైల్వేస్టేషన్‌లోనే బస చేసేవాడు. కొద్ది రోజుల క్రితం తాగిన మైకంలో గుర్తుతెలియని వ్యక్తులు గొడవ పడుతుంటే వారిని మందలించి పంపాడు. ఈ విషయంగా కక్ష పెంచుకున్న వారు శనివారం రాత్రి ఒంటరిగా కనిపించిన మారెప్పపై కత్తితో దాడి చేశారు. స్థానికులు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించారు. రైల్వే పార్శిల్ కార్యాలయం ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తుడు కత్తితో దాడి చేస్తున్న దృశ్యాలు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



వెంకటాద్రిపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



కళ్యాణదుర్గంలో పూర్వ విద్యార్థులతో నాటి అధ్యాపకులు

అపూర్వ సమ్మేళనం

బొమ్మనహాళ్ కాదు — బొకుగుప్ప: మండలంలోని వెంకటాద్రిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1980–81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారందరూ దాదాపు 42 సంవత్సరాల తర్వాత ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. పూర్వ విద్యార్థి గోపా శ్రీనివాసులు నేతృత్వంలో ఈ కార్యక్రమానికి ప్రస్తుత హెచ్ఎం బాలాజీ అధ్యక్షత వహించారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు శ్రీరాములు, నంజుండప్ప, అక్కులప్పను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా రూ.40వేలు విలువ చేసే వివిధ ఉపకరణాలు అందజేశారు. ఇకపై పదో తరగతి పరీక్షల్లో తొలి రెండు స్థానాల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు ఏటా స్కాలర్ షిప్ అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుళ్లాయి, హనుమప్ప, నాగభూషణం, తులసమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1998 – 2001 విద్యాసంవత్సరంలో బ్యాచులర్ ఆఫ్ ఆర్ట్స్ కోర్సు పూర్తి చేసిన వారు పాతికేళ్ల తర్వాత అదే కళాశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జయరామరెడ్డి అధ్యక్షత వహించారు. అధ్యాపకులు వెంకటేశులు, చంద్రమౌళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. స్నేహితులంతా సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్, తిప్పేస్వామి, రామచంద్ర, చిత్తయ్య, అనిల్, శ్రీనివాసులు, రుద్రానంద, సుజాత, విజయభార్గవి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంపనూరులో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు క్షీరాభిషేకం అనంతరం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆకుపూజ , అర్చన, కుజదోష కాల సర్పదోష నివారణకు మూలమంత్ర బీజాక్షర రాహుకేతు హోమం నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలోని పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంజునాథ స్వామికి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం

రాప్తాడు: చేతుల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని రాప్తాడు పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ చేతుల శుభ్రత (గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే) దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు.

సంస్కృతికి ప్రతిబింబం.. దాండియా నృత్యం



లేడీస్‌క్లబ్‌లో దాండియా నృత్యాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: సంప్రదాయ దాండియా నృత్యాలు మన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపడతాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు డాక్టర్ అనంత మాలతి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక లేడీస్ క్లబ్‌లో దాండియా నృత్య కార్యక్రమాన్ని డాక్టర్ అనంత మాలతి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ప్రారంభించారు. దాండియా నృత్య ప్రత్యేకతలు, దసరా విశిష్టతను వివరించారు.

బహురూపం.. అమ్మవారి దర్శనం


కొత్తూరు అమ్మవారి శాలలో పసుపు, కుంకుమ అలంకరణలో అమ్మవారు


పాతూరు అమ్మవారిశాలలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి


నగరంలోని శివాలయంలో బొమ్మల కొలువు

అనంతపురం కల్చరల్: నగరంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వాడవాడలా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారు పూజలందుకున్నారు. బెంగళూరు రోడ్డులోని శివ బాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి అమ్మవారు భరతమాతగా దర్శనమిచ్చారు. శివకోటి, శంకరమఠం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ, ఐదోరోడ్డులోని పెద్దమ్మతల్లి, సుంకులమ్మతల్లి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మొదటిరోడ్డు శివాలయంలో బొమ్మల కొలువు ఆకట్టుకుంది. సుభాష్‌రోడ్డులో అర్బన్‌బ్యాంకు వద్ద దేవీ నవరాతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవిని నిర్వాహకులు సన్మానించారు.

శేషవాహనంపై శ్రీనివాసుడి దర్శనం : స్థానిక ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై తొలిరోజు శేషవాహనంపై ఆలయ పరిసరాల్లో విహరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ఆదివారం ప్రారంభమయ్యాయి. గోవింద నామస్మరణతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఉదయం శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు కమనీయంగా జరిపించారు.

రాప్తాడు మండలంలో..


రాప్తాడు: మండల వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాప్తాడులో మారెమ్మ, పెద్దమ్మ, పార్వతి, గంగలకుంటలో దుర్గమ్మ, పుల్లలరేవులో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలోని అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. హంపాపురం సమీపంలోని మౌనగిరి క్షేత్రంలో 39 అడుగుల అభయాంజనేయ స్వామి, మరూరు చిన్న కదిరయ్య స్వామి, చిన్మయనగర్‌లోని వెంకటేశ్వర స్వామి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నుంచి దసరా పండుగలో భాగంగా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వడ్డుపల్లి గ్రామంలో సుంకులమ్మను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆత్మకూరులోని వాసవీమాతను బాల త్రిపుర సుందరిగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


నగరంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కుంకుమ అలంకరణ


ఆత్మకూరులో బాల త్రిపుర సుందరి అలంకరణలో వాసవీమాత


దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాటలు పాడుతున్న భక్తులు


అలంకరణలో వేంకటేశ్వరస్వామి


హెచ్చెల్సీ కెనాల్ వద్ద రాజరాజేశ్వరి అలంకరణ


ఐదోరోడ్డులో పూజలందుకున్న పెద్దమ్మతల్లి


రాప్తాడులో బాలా త్రిపుర సుందరి దేవి


పాతూరు అమ్మవారిశాలలో పూజలకు హాజరైన మహిళలు

సంతల ఆదాయం రూ.4.29 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.29 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,48,030 వసూలయ్యింది. ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,81,300 మేర వసూలైందని యార్డు చైర్మన్, సెక్రటరీ తెలిపారు.

జీతాలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఏప్రిల్ నెల జీతాలు చేసినా కనగానపల్లి ఎంఈఓ మాత్రం జీతాలు చేయలేదని 1998 ఎంటీఎస్ టీచర్లు వాపోతున్నారు. ఈమేరకు టీచర్లు ఎ.వెంకటేశ్వర్లు, కె.అబీబుల్లా, మహబూబ్‌బాషా, నరసింహులు, సి.రామాంజనేయులు, కృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తామంతా ప్రస్తుతం వేర్వేరు మండలాల్లో పని చేస్తున్నామని, ఎంఈఓలను అడిగితే గతంలో పనిచేసిన మండలంలోనే జీతాలు చేయించుకోవాలని చెబుతున్నారని వాపోయారు. కనగానపల్లి ఎంఈఓ మాత్రం ఆర్నెళ్ల నుంచి జీతం చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు.

నేడు పలు చోట్ల ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని కోర్టు రోడ్డులోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, అరవిందనగర్‌లోని శ్రీకృష్ణదేవరాయ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం నగరపాలక సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. 27, 46వ సచివాలయ పరిధిలో ఉన్న ప్రకాష్‌రోడ్డు, మల్లేశ్వర్ రోడ్డు, ఆదర్శనగర్, లక్ష్మీనరసయ్య కాలనీ ప్రాంతవాసులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కలాం అడుగు జాడల్లో నడుద్దాం

అనంతపురం: ప్రతి ఒక్కరూ డాక్టర్ అబ్దుల్ కలాం అడుగు జాడల్లో నడవాలని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ పేర్కొన్నారు. ఆదివారం జేఎన్‌టీయూ పాలక భవనంలో కలాం చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ శశిధర్ మాట్లాడుతూ భారతదేశ శాంతి సమాజ హితమే అభ్యుదయ మంత్రంగా భావించి, తన జీవితాన్ని జాతి పురోగతికి ధారపోశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, డైరెక్టర్లు ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ సురేష్ బాబు, ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో డాక్టర్ అబ్దుల్ కలాం చిత్ర పటానికి నివాళి అర్పించారు.


గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎల్‌ఎం ఉమ

సెంట్రల్ లైబ్రరీలో: అనంతపురం సెంట్రల్ లైబ్రరీలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమా, డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్ అహమ్మద్, బాషా, కావేరి, శిరీష, ఉజ్జినేశ్వరి పాల్గొన్నారు.

అనంత చరిత్రకు అందమైన జ్ఞాపకం 'ఊరినెర్లు'

అనంతపురం కల్చరల్: అనంత చరిత్రకు అందమైన జ్ఞాపకి ఊరినెర్లు పుస్తకం అద్దం పడుతుందని ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో విమలా శాంతి సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో కవి కురుబ బండి కైలాస్‌నాథ్ రచించిన 'ఊరినెర్లు' పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి అధ్యక్షత వహించారు. మధురకవి మల్లెల నరసింహమూర్తి పుస్తక సమీక్ష చేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, సీనియర్ కవులు రచయితలు డాక్టర్ శాంతినారాయణ, తరిమెల అమరనాథరెడ్డి , రాజారాం, ఉప్పరపాటి వెంకటేష్, కొత్తపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సీనియర్ గాయకుడు మహీధర్ ఆలపించిన తెలుగు వికాస ఉద్యమ గీతం అందరినీ అలరించింది. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాద్, కవులు యంగన్న, నబీరసూల్, చం.శాస్త్రి, జూటూరు షరీఫ్, ఈశ్వరరెడ్డి, నాగేంద్ర, ఆనంద్, వన్నప్ప, చెట్ల ఈరన్న, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.


ఊరినెర్లు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం తదితరులు

నిరుపేద కుటుంబానికి 'అమ్మ' చేయూత

అనంతపురం కల్చరల్: నిరుపేద కుటుంబానికి 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి చేయూతనందించారు. బుక్కరాయ సముద్రం మండలం రెడ్డిపల్లికి చెందిన మల్లన్న, ఆరాధమ్మ వృద్ధులు. కూలిపనులకు వెళ్లలేని పరిస్థితి. దీనికితోడు 22 ఏళ్ల కొడుకు శివ చిన్నతనంలోనే పక్షవాతంతో మంచంపట్టాడు. చాలాచోట్ల వైద్యం చేయించేందుకు డబ్బులు ఖర్చయినా ఫలితంలేదు. దాంతో ఇల్లు గడవక పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చింది. విషయం తెలుసుకున్న 'అమ్మ' సంస్థ తరిమెల రమణారెడ్డి స్పందించారు. ఆదివారం బాధిత కుటుంబానికి రూ.10 వేలు విలువ చేసే వీల్ చైర్, రూ.20 వేలు నగదు, మరో రూ.20 వేలు పెట్టి నూతన వస్త్రాలు, మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు.


శివకు వీల్‌చైర్, నగదు అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

నిరుద్యోగులకు శిక్షణ

బుక్కరాయసముద్రం: రోటరీపురంలోని అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అభయ సీసీఎల్ క్యాంపస్ కోఆర్డినేటర్ భార్గవ్ ఆదివారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు డ్రైవింగ్, టైలరింగ్, మొబైల్ రిపేరీ, కంప్యూటర్ బేసిక్స్, బ్యూటీషియన్స్ తదితర వాటిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణలో భోజనం, వసతి కల్పిస్తున్నామని తెలిపారు. వివరాలకు 9701241487 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం


మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: రాంనగర్‌లోని ఇషాన్ ఆయుర్వేద హీలింగ్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వాహకురాలు డాక్టర్ సాయిప్రవల్లిక డయాబెటీస్, సోరియాసిస్, గ్యాస్ట్రైటీస్, ఆర్థరైటీస్, తదితర సమస్యలతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఇషాన్ నిర్వాహకులు మధుసూదన్ రెడ్డి, మహాలక్ష్మి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: 'ఎన్నో ప్రభుత్వాలు చూశారు..ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశారు.. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అందరికీ మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి పంచాయతీ పరిధిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే.. ప్రభుత్వంతో చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రతి గడపలోనూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధి పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు.

అవినీతికి తావులేకుండా పథకాల వర్తింపు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందిందన్నారు. పైసా అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారన్నారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ చంద్రకుమార్, నాయకులు ధనుంజయయాదవ్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్ గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, సునీల్‌దత్తరెడ్డి, చియ్యేడు, ఉప్పరపల్లి, కక్కలపల్లి సర్పంచులు గంగాధర్‌రెడ్డి, సావిత్రి శ్రీనివాసులు, కృష్ణయ్య, సచివాలయ కన్వీనర్లు మనోహర్, సాకే ఆనంద్, మాజీ ఎంపీటీసీ నారాయణరెడ్డి, శ్రీనివాసులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


మహిళకు లబ్ధిపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఎమ్మెల్యే చొరవతో ఉప్పరపల్లి రోడ్డుకు మోక్షం

రాప్తాడురూరల్: ప్రధాన రహదారి నుంచి ఉప్పరపల్లి వరకు బీటీ రోడ్డు మంజూరైంది. రూ. 48 లక్షల నిధులు మంజూరయ్యాయి. అనంతపురం- పంగల్ రోడ్డు రహదారి నుంచి వంద మీటర్ల దాకా సీసీ రోడ్డు ఉంది. అక్కడి నుంచి ఉప్పరపల్లి గ్రామం వరకు 2.2 కిలో మీటర్లు బీటీ రోడ్డు వేయనున్నారు. ఈ పనులకు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భూమిపూజ చేశారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

నేడు ప్రపంచ అనస్తీషియా దినోత్సవ ర్యాలీ

అనంతపురం మెడికల్: ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో సోమవారం ర్యాలీఉంటుందని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ర్యాలీ వైద్య కళాశాల నుంచి తెలుగుతల్లి కూడలి మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అనస్తీషియా విభాగంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పునఃప్రారంభమైన ఎల్కేపీ ప్రధాన ద్వారం

అనంతపురం కల్చరల్: రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన లలిత కళాపరిషత్తు ప్రధాన ద్వారాన్ని పునఃప్రారంభించారు. ఆదివారం ఎల్కేపీ కార్యదర్శి గాజుల పద్మజ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రధాన ద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, ఉపాధ్యక్షుడు సంగాల నారాయణస్వామి తదితరులు కళాకారులను సన్మానించారు.

ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం అర్బన్: గాజాపై ఇజ్రాయిల్ విధించిన అనాగరిక దిగ్బంధాన్ని ఖండిస్తున్నట్లు ఎస్‌యూసీఐ(సీ) పార్టీ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర అన్నారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఇజ్రాయిల్ చర్యలను వ్యతిరేకిస్తూ ఎస్‌యూసీఐ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. రాఘవేంద్ర మాట్లాడుతూ గాజాపై వైమానిక బాంబు దాడులను వెంటనే ఆపాలని, దిగ్బంధాన్ని ఉపసంహరించాలని ఇజ్రాయిల్‌ను కోరారు. కార్యక్రమంలో నాయకులు తబ్రేజ్, నాగముత్యాలు, నరేంద్ర, మహేశ్, శివప్ప, గౌతమి, చరణ్‌దీప్, చరణ్‌తేజ్ పాల్గొన్నారు.

దాబాలపై దాడులు

అనంతపురం క్రైం: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో దాబాలపై పోలీసులు దాడులు చేశారు. మద్యం తాగేందుకు అనుమతివ్వకూడదన్న పోలీసుల ఆదేశాలను ఖాతరు చేస్తున్న యజమానులకు గట్టి హెచ్చరికలు చేశారు. కర్ణాటక మద్యాన్ని విక్రయించినా, తాగేందుకు అనుమతి ఇచ్చినా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.